# పేరు

"ఇప్పటి వరకూ ఎక్కడ చచ్చావు - టైం ఏడు దాటింది. రాజుకి స్నానం చేయించాలి. త్వరగా రా" పనిమనిషిని కసురుకుంది రూపిణి. ఆమె పాల మీగడ తరగలా ఉంది. పొంగుతున్న పాల మీది నురగలా ఉంది ఆమె గౌను. ప్రవహిస్తున్న బంగారంలా ఉంది ఆమె నడుస్తుంటే.

టెన్నిస్ కోర్టంత ఉన్న బాత్రూంలోకి సుతారంగా అడుగుపెట్టింది రూపిణి. రాజుని అపురూపంగా, నాజూగ్గా ఎత్తుకుని గుండెలకు హత్తుకుని - తన కాళ్ళుపడితే ఎక్కడ మాసిపోతుందేమో అన్నంత జాగ్రత్తగా వచ్చింది పనిమనిషి. గీజర్‌లోంచి వచ్చిన నులివెచ్చని నీళ్ళుపోసి సబ్బుతో వళ్ళంతా మృదువుగా రుద్దింది.

"రాజుని శుభ్రంగా జాగ్రత్తగా తుడువు" పనిమనిషి చేతికిచ్చింది.

తన పిల్లాడిని ఎత్తుకునే దానికన్నా వందరెట్లు భద్రంగా, భయంగా, భక్తిగా రాజుని ఎత్తుకుంది పనిమనిషి. తన ఇంటి నెల ఖర్చంత ఖరీదయిన టవల్‌తో నాజూగ్గా అద్ది తుడిచింది.

రూపిణి వచ్చి సోఫాలో కూచున్నాక ఒళ్ళోకిచ్చింది - ఫారిన్ నుంచి తెచ్చిన విలువైన గాజు బొమ్మని అందిస్తున్నంత ఒడుపుగా.

"నా బంగారు కొండ" రాజుని ముద్దాడింది రూపిణి.

నగిషీలు చెక్కిన వెండి ప్లేట్లో బిస్కట్లు తెచ్చి పెట్టింది పనిమనిషి.

నెయిల్ పాలిష్ అడ్వర్‌టయిజ్‌మెంట్లో చూపించే చేతులకన్నా అందమైన చేతితో వయ్యారంగా ఒక్కో బిస్కట్ తినిపించింది రూపిణి.

"రాజుకి పాలు పట్రా" అర్డర్ జారీ చేసింది దర్పం తొణికిసలాడే గొంతుతో.

"వస్తున్నానమ్మా"పరుగెత్తుతున్నట్లువచ్చింది పనిమనిషి చిక్కటి పాలు నిండిన వెండి గ్లాస్‌తో.

"నువ్వెందు కిక్కడ? దిష్టి తగుల్తుంది వెళ్ళు" రాజుకి పాలు పట్టిస్తూ కసురుకుంది రూపిణి.

పనిమనిషితలవంచుకునివంటగదిశుభ్రం చేయడానికి వెళ్ళిపోయింది.

"రాజూ - నా రాజూ - ఇంకొద్దిగా తాగు నాన్నా" బతిమాలుతోంది రూపిణి.

పనిమనిషికి తన కొడుకు గుర్తొచ్చాడు. తన కిష్టిగాడు. వాడు అచ్చం వాళ్ల నాన్న పోలికే. వాడు కడుపులో ఉన్నప్పుడు వాడి నాన్న చచ్చిపోయాడు - ఫ్యాక్టరీ యంత్రంలో పడి నలిగి ఊపిరాడక. అందుకే వాడు పుట్టాక వాడి బాబు పేరు పెట్టుకుంది. ఇప్పుడేం చేస్తున్నాడో అన్న ఆలోచన వచ్చింది. తన చిన్న గుడిసెలో చిన్ని కృష్ణుడిలా ఆడుకుంటూ ఉంటాడు. వాడికో గ్లాసెడు పాలిచ్చి ఎన్నాళ్ళయిందీ?

"ఎన్నిసార్లు పిలవాలి? వినిపించడం లేదా?" రూపిణి అరుపులకు ఈ లోకంలో కొచ్చి, చేతులు తన చీర కొంగుకి తుడుచుకుంటూ డ్రాయింగ్ రూంలోకి పరుగెత్తింది.

"రాజుని అలా కొద్దిగా తోటలోకి తీసుకెళ్ళి తిప్పుకురా"

"చైన్ వేసి పట్టుకెళ్తానమ్మా"

"ఎందుకూ -రాజూ ఈజ్ యే గుడ్‌బాయ్'

"చైన్ లేకపోతే ఈ కుక్కపిల్ల తెగ ఏడిపిస్తుందమ్మా - దాని వెంట పరుగెత్తలేక చావాలి"

"నోర్ముయ్" గర్జించింది రూపిణి. ఆవిడ అందమైన కళ్ళు మండుతున్న నక్షత్ర గోళాల్లా ఉన్నాయి.

"నీకెన్ని సార్లు చెప్పానే - రాజుని కుక్కపిల్ల అని పిలవొద్దని. ఒళ్ళు దగ్గర పెట్టుకుని పనిచేయి. బంగారం లాంటి పేరు పెట్టుకుంది కుక్కపిల్ల అని పిలవటానికి కాదు. దాని పేరు రాజు. అర్థమైందా ? మరోసారి ఇలాంటి పొరపాటు జరిగితే నాలుక చీరేస్తాను. జాగ్రత్త" చిందులు తొక్కింది రూపిణి.

గజగజ వణికిపోయింది పనిమనిషి.

"తప్పైపోయిందమ్మా. క్షమించండి" కన్నీళ్ళొచ్చేశాయి ఆమెకు.

రాజుని ఎత్తుకుని తోటలోకి వెళ్ళిపోయింది.

* * * * *

"ఒరేయ్ కిష్టిగా - అమ్మగారికి నమస్కారం చేయటం మర్చిపోకురా" నిజంగా మర్చి పోతాడేమోనన్న భయంతో పదోసారి జాగ్రత్త చెప్పింది పనిమనిషి తన కొడుకుతో. ఆ రోజు వాడి పుట్టిన రోజు. వాడికి తలారా స్నానం చేయించి, ఉతికిన బట్టలు తొడిగి యజమానురాలి ఇంటికి పిల్చుకెళ్తోంది సంబరంగా. . . .

"అమ్మగారు మంచివారురా కిష్టిగా. నీకు బహుమతి నిస్తారు".

కృష్ణమూర్తి నుంచి ఎలాంటి సమాధానం రాకపోయేసరికి ఆగి వాడివైపు చూసింది.

వాడు కోపంగా ఉన్నాడు

"ఏమిటీ - ఏమైందింతలో" అంది ఆశ్చర్యంగా.

"నా పేరు కిష్టిగాడు కాదు. కృష్ణమూర్తి. నీ కెన్నిసార్లు చెప్పాలి" అన్నాడు వాడు చిరాగ్గా.

మొదట విస్మయం - ఆ తర్వాతవింత ఆనందంతో పకపకా నవ్వింది పనిమనిషి.

"వేలెండంత లేవు. నీ కెంత ఉక్రోషంరా" తన కొడుక్కి అతని పేరు మీదున్న ఆపేక్షను ముచ్చటపడుతూ అంది.

యజమానురాలి ఇంట్లోకి అడుగుపెట్టగానే కృష్ణమూర్తిని ఆకర్షించింది రూపిణి ఒళ్ళో ఉన్న ముద్దొచ్చే తెల్లటి బొచ్చు కుక్కపిల్ల.

ఆ క్షణంలో వాడు అమ్మ చెప్పిన విషయాలన్నీ మర్చిపోయాడు.

ఆనందంతో కుక్కపిల్ల దగ్గరకు పరుగెత్తాడు.

రూపిణి భద్రకాళిలా ఉరిమి చూసింది. వాడి ఆనందం చప్పున చల్లారిపోయింది. మధ్యలోనే ఆగిపోయాడు.

"ఎవడ్రా నువ్వు మడ్డి వెధవా?" గర్జించింది రూపిణి - హనుమంతుణ్ణి అడ్డుకున్న లంఖిణిలా.

"నా పేరు కృష్ణమూర్తి" తనని మడ్డి వెధవ అన్నందుకు వచ్చిన కోపాన్నంతా మింగి చెప్పాడు.

"ఆ మట్టి చేతుల్తో నా రాజుని తాకితే -అమ్మో అనారోగ్యం చేయదుట్రా రాస్కెల్".

"నా పేరు రాస్కెల్ కాదు. కృష్ణమూర్తి" మరలా చెప్పాడు తీవ్రమైన స్వరంతో.

"నీ మొఖానికి ఓ పేరు కూడా. ఫో ఇక్కణ్ణించి" కసురుకుంది రూపిణి.

"ఏం మీ కుక్కకు పేరుండగా లేనిది నా కెందుకుండకూడదు?" మొండిగా, ఖరాఖండిగా వచ్చింది సమాధానం.

రాక్షసే అయింది రూపిణి.

కృష్ణమూర్తిని పట్టుకుని ఆ చెంపా, ఈ చెంపా వాయించింది. " నా రాజూ,

నీవూ ఒకటేనట్రా - అసలు దాన్ని కుక్క అనటానికి నీకెంత ధైర్యం?" ఆయాసం వచ్చేవరకూ కొడుతూనే ఉంది.

పొంగుకొస్తున్న దుఃఖాన్ని, పొరలి వస్తున్న ఆవేశాన్ని, ఉక్రోషాన్ని బలవంతంగా అణుచుకుంటూ ఒక్కసారిగా విదిలించుకుని ఓ నాలుగ్గజాల దూరం పరుగెత్తి నిలబడ్డాడు కృష్ణమూర్తి.

ఆయాసంతో రొప్పుతోంది రూపిణి.

"ఇప్పుడు చెప్పరా దాన్ని కుక్క అంటావా"

వాడు అమ్మవైపు చూశాడు. గుడ్లనీరు కుక్కుకుంటూ రోదిస్తోంది. రూపిణి వైపు  చూశాడు. మొరిగి మొరిగి ఆయాసం తీర్చుకుంటున్న కుక్కలా ఉంది. రాజు వైపు చూశాడు. ముద్దుగా బొద్దుగా ప్రశాంతంగా ఉంది.

"చెప్పవేంరా ఇడియట్" ముందుకు అడుగువేసింది రూపిణి.

అసహ్యాన్నంతా తన గొంతులో నింపుకుని "కుక్క" అని కసిగా పెద్దగా అరిచి బైటికి వేగంగా పరుగెత్తాడు కృష్ణమూర్తి.

● *ఆంధ్రప్రభ, జనవరి 2, 1995* ●